# రెండేళ్లలో రీజినల్ రింగ్ రోడ్డు

ప్రమాదరహితంగా రహదారుల అభివృద్ధి: కేసీఆర్



హైదరాబాద్‌లో రహదారులపై సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ నిర్మించతలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్‌ను రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. దాదాపు 330 కిలోమీటర్ల ఈ రోడ్ నిర్మాణానికి సంబంధించి కార్యాచరణను వెంటనే సిద్ధం చేయాలని ఆయన నిర్దేశించారు. ప్రమాదరహిత ప్రయాణం సాగేలా రాష్ట్రంలో రోడ్ల వ్యవస్థను తీర్చిదిద్దాలని, అంతర్జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలతో రహదారులను అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో రహదారుల ప్రస్తుత పరిస్థితిని సమగ్రంగా అధ్యయనం చేసి వచ్చే 10ఏళ్లలో తీసుకోవాల్సిన చర్యలపై నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఆర్అండ్‌బి రహదారులు, భవనాలపై క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి మంగళవారం

మిగతా 3వ పేజీలో

## 'మెట్రో రోడ్డు'కు కేంద్రం మరమ్మతు

ఎల్బీనగర్-మియాపూర్ రహదారికి 42 కోట్లు

ఐఆర్‌సీ సదస్సు నేపథ్యంలో నిర్ణయం 3

ఆంధ్రజ్యోతి Wed, 19 October 2016
epaper.andhrajyothy.com/c/14014490

# రెండేళ్లలో రీజినల్ రింగ్ రోడ్డు

(మొదటిపేజీ తరువాయి)



సమీక్ష జరిపారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సి.లక్ష్మారెడ్డితో పాటు, ముఖ్య కార్యదర్శులు సి.నర్సింగ్‌రావు, సునీల్ శర్మ, ఈఎన్సీలు రవీందర్‌రావు, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో రహదారుల ప్రస్తుత పరిస్థితి? భవిష్యత్తులో మెరుగైన రహదారుల కోసం ఏం చేయాలి? జాతీయ రహదారులుగా మార్చాల్సి న రూట్లు ఏవి? కేంద్ర పథకాల ద్వారా నిర్మించాల్సిన రోడ్లు ఎక్కడున్నాయి? ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా తట్టుకునేలా రహదారులు ఎలా నిర్మించాలి? తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేసి, భవిష్యత్తుకు పనికొచ్చేలా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మనిషి ప్రాణాలు అత్యంత విలువైనవన్న ఆయన, ప్రమాద రహిత ప్రయాణానికి అనువుగా రహదారుల వ్యవస్థను తీర్చిదిద్దాలని నిర్దేశించారు. రహదారుల నిర్మాణం, నిర్వహణకు సం బంధించి రాష్ట్రం అవలంబించే విధానం యావత్ దేశానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. కాగా, హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగురోడ్ అవతల 330 కిలోమీటర్ల మేర రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులను వెంటనే చేపట్టి రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్దేశించారు. పనిని ఎక్కువ ప్యాకేజీలుగా విభజించి తక్కువ సమయంలో డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో 2500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను కేంద్రం మంజూరు చేసిందని గుర్తు చేశారు. జాతీయ రహదారులతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాలతో నిర్మించే రహదారు లు, రాష్ట్ర పరిధిలోని రోడ్లన్నింటినీ పరిగణలోకి తీసుకుని దానికి అనుగుణంగా విజన్ డ్యాకుమెంట్ సిద్ధం చేయాలని సూచించారు. రోడ్లు త్వరగా పాడవకుండా, విదేశీ విధానాలు అధ్యయనం చేయాలని పేర్కొన్న సీఎం, యూరోప్, అమెరికా దేశాల్లో రోడ్లు బాగుంటాయని గుర్తు చేశారు. రోడ్ల పక్కన పిచ్చి చెట్లు తొలగించి సైడ్ బర్మ్స్ నిర్మించాలని, ప్రధాన రహదారులపై ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు, వంతెనలు, కాజ్‌వేలు, రోడ్ అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, దశల వారీగా నిర్మించేలా విజన్ డాక్యుమెంటులో పొందుపర్చాలని నిర్దేశించారు. జాతీయ రహదారులపై ఏలాండ్‌లు నిర్మించి, చక్కగా నిర్వహించాలని కోరారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు బైపాస్‌లు నిర్మించాలని సూచించారు. ట్రాఫిక్ ఉన్న చోట్ల ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
Wed, 19 October 2016
epaper.andhrajyothy.com/c/14014574